


రాజమహేంద్రవరంలో పోలీసుల హై అలర్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎసిబి కోర్టు ఈ నెల 22వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరంలో హైఅలర్ట్ ప్రకటించారు. విజయవాడ ఎసిబి కోర్టు నుంచి ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించే క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తారనే సమాచారాన్ని అందుకున్న తూర్పు గోదావరి జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. రాజమహేంద్రవరం నగరానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి టిడిపి నేతలు, శ్రేణులు రాకుండా ఎక్కడకక్కడ పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. నగరంలోకి ప్రవేశించే అన్ని ప్రధాన రహదారులతోపాటు, ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాలతో కలిపి 36 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు.

రాగి జావకు పైసా ఇవ్వని ప్రభుత్వం

- అష్టకష్టాలు పడుతున్న కార్మికులు
- తప్పని అదనపు భారం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి పోషక విలువలు గల రాగిజావను పంపిణీ చేస్తున్నారు. వారంలో మూడు రోజులపాటు మంగళ, గురు, శనివారాల్లో దీన్ని అందిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా వండి, వడ్డించి, పంపిణీ చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మాత్రం పైసా విదల్చట్లేదు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే మెనూ బిల్లులు సరిపోని కారణంగా ఇప్పటికే తీవ్రంగా సతమతమవుతున్న కార్మికులపై రాగిజావ మరో ఇబ్బందిని తెచ్చి పెట్టింది.

కాకినాడ జిల్లాలో 1,250 పాఠశాలల్లో 1,46,849 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రైమరీ విద్యార్థులు 42,960 మంది, యుపి విద్యార్థులు 12,403, హైస్కూలు విద్యార్థులు 91,486 మంది ఉన్నారు. వీరిలో 1,03,138 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. రాగి జావ మాత్రం 1.46 లక్షల మందికీ అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో కాకినాడ అర్బన్ సహా 8 మండలాల్లో 504 పాఠశాలల్లో సుమారు 68 వేల మందికి అక్షయ పాత్ర, అల్లూరి సీతారామరాజు స్వచ్ఛంద సంస్థల నుంచి జావను వండి తెలుస్తున్నారు. మిగిలిన 78 వేల మందికి జిల్లాలో ఉన్న కార్మికులు పాఠశాలల్లోనే వండుతున్నారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడి కలిపి ఉదయం 8:45 గంటలకు ఇవ్వాలని గైడెలెన్స్ జారీ చేశారు. ఉదయమే జావ తయారు చేసి పిల్లలకు ఇస్తున్నారు. గంట ముందే ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరుకుని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తున్నారు.

సరిపోని నిధులు

జావ తయారు చేస్తున్న కార్మికులకు అదనంగా పైసా కూడా ఇవ్వడం లేదు. గ్యాస్, నిత్యావసరాలు ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం మెనూ కింద ఇచ్చే నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని కార్మికులు అనేకేళ్లుగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88 పైసలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థికి రూ.8.57 చొప్పున మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. రైస్, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి, బెల్లం సరఫరా చేస్తున్నా కూరగాయలు, ఆయిల్, కందిపప్పు, తదితర వస్తువులన్నీ ప్రభుత్వం ఇస్తున్నా కొద్ది కుకింగ్ చార్జీలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని గగ్గోలు పెడుతున్నారు. గ్యాస్ ధర భారీగా పెరగ్గా, కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు అకాశాన్నంటాయి. కొత్తగా రాగి జావ తయారీకి వాడే గ్యాస్ అదనపు భారమవుతుందనే ఆందోళన వ్యక్తం అవుతుంది. 100 మంది విద్యార్థులకు జావ తయారీకు రూ.40 గ్యాస్ ఖర్చు అవుతుందని కార్మికులు తెలిపారు. నెలలో 15 రోజుల పాటు రాగిజావను కాయాల్సి వస్తుంది. ఫలితంగా గ్యాస్ త్వరగా అయిపోతుందని వారంటున్నారు. మరో వైపు ప్రభుత్వం దీని తయారీకి వంట పాత్రలు ఇస్తామని చెప్పినా నేటికీ ఇవ్వలేదు. దీంతో కార్మికులే వాటిని సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది. గ్యాస్, వంట పాత్రల ఖర్చుతో బాటు శ్రమ కూడా పెరిగిందని తమకు మెనూ నిధులు, వేతనాలు పెంచాలని కోరుతున్నారు.



రాగిజావ తాగుతున్న విద్యార్థులు

మహిళా కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏజెన్సీ ముఖ ద్వారమైన ఏలేశ్వరంలో మహిళ డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి స్త్రీ విద్యను ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరహాలు, ఎం గంగా సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ నెల 8 నుండి 14 వరకు జరిగే ఎస్ఎఫ్ఐ సైకిల్ ర్యాలీలో భాగంగా ఆదివారం ర్యాలీ ఏలేశ్వరం చేరుకుంది. స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో వారు విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలోని ఐదు మండలాల ప్రజలు విద్య నిమిత్తం ఏలేశ్వరం రావాల్సి ఉందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా జూనియర్ డిగ్రీ కళాశాల లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను డిగ్రీ విద్యకు దూరం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతవరకు ఇంటర్ పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదని, ప్రభుత్వం అందిస్తున్న మెస్ ఛార్జీలు చాలీచాలకుండా ఉన్నాయని, జిఒ 77 వల్ల పిజి విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ అందక చదువు మానుకోవాల్సి వస్తోందన్నారు. జిఒ 107, 108 ద్వారా వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ అధ్యాపక ప్రొఫెసర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ యాత్రలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మణికంఠ, సాహితి, గోపాల్, రాజేష్, సంజయ్, శివ, పవన్, రోహిత్, వాసు, నాని తదితరులు ఉన్నారు.



యాత్రలో పాల్గొన్న విద్యార్థులు

కరాటే పోటీల్లో ఛాంపియన్‌గా ఉమ్మడి జిల్లా

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

విశాఖపట్టణం స్వర్ణ భారతి స్టేడియంలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కరాటే టీముకు 'మొదటి నేషనల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్" లభించింది. ఈ మేరకు సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో విద్యార్థులను, కరాటే కోచ్ డి.శంకర్రావు అభినందన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా మొదటి వైస్ గవర్నర్ ఈదల ఈశ్వర్ కుమార్, క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తులూరి వీర్రాజు (రాజా), క్లబ్ అధ్యక్షులు కానుబోయిన విజయకృష్ణ మాట్లాడుతూ సుమారు దశాబ్ద కాలంగా సామర్లకోటలో విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందుతున్నట్టు చెప్పారు. ఏటా కోచ్ శంకర్ ఆధ్వర్యంలో అనేక మంది విద్యార్థులు ఈ క్రీడలో అత్యంత ప్రతిభను కనపరుస్తూ జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. ఇదే ప్రతిభతో రానున్న రోజుల్లోనూ సామర్లకోట ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలోనూ నిలపాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరాటే కోచ్ శంకర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో 20 రాష్ట్రాల నుంచి అన్ని కేటగిరీల్లో సుమారు వెయ్యి మందికి పైగా పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ తరపున ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుండి 120 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో కాకినాడ, సామర్లకోటల నుంచి పాల్గొన్న విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనపరచి పతకాలు సాధించారన్నారు. దానికి మించి జాతీయ స్థాయిలో 'మొదటి ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్ షిప్'ను కైవసం చేసుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ నాయకులు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్ఆర్‌వైవిఆర్ఎల్.ప్రసాద్, కోశాధికారి బడుగు సీతారామరాజు, నాయకులు ఎం.శివనాగకృష్ణ, డాక్టర్ గొరకపూడి చిన్నయ్య దొర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు తహశీల్దార్ గోపాలకృష్ణ సస్పెన్షన్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు తహశీల్దారు పివివి.గోపాలకృష్ణను సస్పెండ్ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్తిపాడు మండలం గోకవరంలో సుమారు 25 ఎకరాల భూమిపై సుదీర్ఘ కాలంగా వివాదం ఉంది. ఈ భూమి శరభవరం గ్రామానికి చెందిన కూసుమంచి సీతయమ్మకు చెందినట్టు రికార్డుల్లో ఉంది. పెద్దిపాలెం గ్రామానికి చెందిన చింతాకుల భాస్కరరావు కుటుంబికులు సుమారు 40 ఏళ్లుగా ఈ భూమిలో సాగు చేస్తున్నారు. ఈ భూమికి తాము హక్కుదారులమంటూ రెండు గ్రూపులూ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. అయితే ఈ భూమిలో 10 ఎకరాలను సత్తి వినోద్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి సీతయమ్మ విక్రయించారు. వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ వినోద్ కుమార్ రెడ్డికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడంతో చింతాకుల భాస్కరరావు కుటుంబికులు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సిసిఎల్ఎ తహశీల్దారు పివివి.గోపాలకృష్ణను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామారావు ధ్రువీకరించారు. ఏలేశ్వరం తహశీల్దార్ చిన్నారావును ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నియమించారని ఆర్‌డిఒ తెలిపారు.



తహశీల్దారు గోపాలకృష్ణ



వైద్య శిబిరంలో పాల్గొన్న ట్రస్ట్ నిర్వాహకులు, నాయకులు

400 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఇంజరం ప్రాథమిక పాఠశాలలో కెవిఆర్.అంజలి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కాకరపర్తి వెంకటరావు ఆధ్వర్యంలో కాకినాడ ట్రస్ట్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన డాక్టర్లకు కెవిఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కాకరపర్తి వెంకటరావు, పూర్ణిమ దంపతులు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్ వైద్యులు ఎన్‌వి.స్వామి, బి.దుర్గా పవన్ కుమార్, పి.సూర్య ప్రకాష్ నాయుడు, ఓలేటి వీర అఖిల్ కుమార్ శర్మ బృందం సుమారు 400 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య సేవలు పొందారు. ట్రస్ట్ చేస్తున్న సేవలను స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరాం ప్రసాద్ కొనియాడారు. సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, దుడ్డు సూర్యనారాయణమూర్తి, ఓలేటి వెంకటరమణమూర్తి, కేశప్రగడ కృష్ణమూర్తి, సాలగ్రామ సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలో పల్లవికి తృతీయ స్థానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్విమ్మింగ్ పోటీలో మండలంలోని రాయభూపాల పట్నంకు చెందిన మన్యం పల్లవి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మహారాష్ట్రలోని పూణే బాలెవాడి స్టేడియంలో జరిగిన 12 వ జాతీయస్థాయి బయతిల్ (రన్నింగ్-స్విమ్మింగ్) పోటీలో, ట్రాయతిల్ (రన్నింగ్-షూటింగ్-స్విమ్మింగ్) పోటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి అండర్-11 కేటగిరీలో పాల్గొని రెండు ఈవెంట్లలోను తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పలువురు పల్లవిని అభినందించారు.



పతకాలు సాధించిన పల్లవి

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతుందని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సెప్టెంబర్ 12న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్ కు తెలియజేయవచ్చని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబు అరెస్టుపై టిడిపి శ్రేణుల దీక్షలు

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆదివారం నిరసన దీక్షలు చేపట్టాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

తుని చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ తుని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఆదివారం కొనసాగుతున్నాయి. చంద్రబాబు నాయుడును తక్షణమే విడుదల చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు సామూహిక దీక్షలు చేపట్టారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. తుని, కోటనందూరు, తుని తొండంగి మండలాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన నాయకులు ప్రభుత్వ వైఖరిపై సిఎం వైఎస్.జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసేందుకు యనమల కృష్ణుడు పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి బయలుదేరారు. పోలీసులు తెలుగుదేశం నేతలను అడ్డుకున్నారు. యనమల కృష్ణుడి అనుచరగణం శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు ఎన్టీఆర్ విగ్రహానికి సీనియర్ నేతలతో కలిసి కృష్ణుడు వినతిపత్రం అందించారు. చంద్రబాబుపై అక్రమ కేసులు ఎత్తివేసి తక్షణమే విడుదల చేయాలని కోరుతూ కృష్ణుడు పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోల్నాటి శేషగిరిరావు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, కరపా అప్పారావు ఇనుగంటి సత్యనారాయణ, గాడి రాజబాబు, అప్పన రమేష్, వంగలపూడి బుజ్జి, చింతంనీడి అబ్బాయి, మళ్ల గణేష్, రామచంద్ర రాజు, దంతులూరి శ్రీనివాసరాజు, మాజీ ఎంపిపి అంకంరెడ్డి నాన్న అబ్బాయి, సిద్ధా రాంబాబు, పేకేటి హరిబాబు, కోడ రమణ, బోడపాటి సత్యనారాయణ, అంకంరెడ్డి బుల్లిబాబు, రుత్తల శ్రీనివాస్, చింతకాయల రవి, గాది వరహాలబాబు పాల్గొన్నారు.



తునిలో..



ప్రత్తిపాడులో..



పెద్దాపురంలో..

పెద్దాపురం చంద్రబాబును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆదివారం స్థానిక సుధా కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర పావని, అడబాల కుమారస్వామి, ఎలిశెట్టి నాని, పేకేటి వెంకటేశ్వరరావు, మేడిది శ్రీనివాస్, చాగంటి గోపాలకృష్ణ, గుత్తుల సూర్యావతి, నంది ఉమామహేశ్వరి, రంది సత్యనారాయణ, కొరుపూరి రాజు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్య ప్రభ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అన్నారు. ఈ దీక్షలో వైసిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, జ్యోతుల పెద్దబాబు, సూతి బూరయ్య, బస ప్రసాద్, బొదిరెడ్డి గోపాలకృష్ణ, పెంద్ర శ్రీను, వైభోగుల సుబ్బారావు, బెల్లాని శ్రీను పాల్గొన్నారు. వరుపుల సత్య ప్రభ రాజా ఆధ్వర్యంలో రోడ్డుపై మోకాళ్లపై నడుస్తూ నిరసన తెలిపారు. పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు సాయంత్రం 4 గంటల వరకూ దీక్ష కొనసాగించారు.

కార్టూ'నిజం'



మీ నాయకుడి మీద సిబిఐ కేసులే ఉన్నాయ్.. అదే మా నాయకుడు మీదైతే సిఐడి, ఎసిబి, ఇడి కేసులన్నాయ్.. మా నాయకుడే గొప్ప..!!

14న భవన నిర్మాణ కార్మికుల చలో తుని

ప్రజాశక్తి-కోటనందూరు, పెద్దాపురం

భవన కార్మికుల సెప్టెంబర్ 14న చలో తుని సామూహిక రాయబారాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ పిలుపు ఇచ్చారు. ఆదివారం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘ నాయకులతోనూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన కోటనందూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ,పెండింగ్ పరిహారాలు తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ బోర్డు నిధులు తన సొంత అవసరాలకు రూ.2500 కోట్లను ఈ బోర్డు నుంచి తీసుకోవడం అన్యాయమని అన్నారు. ఈ సంక్షేమ బోర్డు నుంచి తీసి డబ్బులను తక్షణమే సంక్షేమ బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రంలో వలే ఈ రాష్ట్ర జగన్ ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారా భవన కార్మికులకు రాయితీలు ఇచ్చి కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల పరిహారం ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. భవన కార్మికులు అసంఘటిత కార్మికులు అందరూ కలిసి ఐక్య ఉద్యమాలతో ముందుకి వెళ్లాలన్నారు. జనసేన నాయకులు మాట్లాడుతూ భవన కార్మికులు జరిగిన అన్యాయంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి భవన కార్మికులకు అండగా నిలుస్తామని వాళ్ల పోరాటాలకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ నాయకులు వైలెట్ అప్పారావు, పి.శ్రీను, రమణ బొజ్జ నూకరాజు, సూరిబాబు, సంతోష్, నాగరాజు మాణిక్యం, రవణమ్మ, మర్యా రత్నం, దేవుడమ్మ, దుర్గ పాల్గొన్నారు.

ఈ నెల 14న మంత్రి దాడిశెట్టి రాజా ఇంటికి సామూహిక రాయబారం కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు విజ్ఞప్తి చేశారు. పెద్దాపురం వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో సిఐటియు మండల కార్యదర్శి దారపు రెడ్డి క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలోని అన్ని విభాగాల కార్మికులు జరిపిన అనేక పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పడిందన్నారు. ఈ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అటువంటి సంక్షేమ బోర్డును జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి 25 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. కరోనా సమయంలో కూడా భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం చేస్తానని ఇచ్చిన మాట కూడా ప్రభుత్వం నిలుపుకోలేదన్నారు. ఈ తరుణంలో సంక్షేమ బోర్డును రక్షించుకునేందుకు భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన మంత్రి ఇంటికి సామూహిక రాయబారంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, ఆనంద్, సిపిఎం మండల నాయకులు సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, సామర్లకోట సిఐటియు కార్యదర్శి సురేష్, ఈశ్వరరావు, చింతల సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, నీలం శ్రీను, తైనాల శ్రీను, మాగాపు నాగు, కరణం అప్పారావు, గూనూరు వెంకటరమణ, వడ్డి సత్యనారాయణ, పెద్దిరెడ్డి విష్ణు, ఆదిరెడ్డి శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం సమావేశంలో మాట్లాడుతున్న రాజ్ కుమార్

ఘనంగా వేద పండిత సభ

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట రూరల్

పెద్దాపురం రామారావు పేటలోని ఆదివారం వేద పండిత పరిషత్ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభలో టిటిడి ఇసి సభ్యుడు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ ఘనాపాటి, విద్యారణ్య గుళ్లపల్లి శ్రీహర్ష ఘనాపాటి పరీక్షాధికారులుగా, రేమెళ్ళ బాపన్న సోమయాజులు ఉపన్యాసకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వేద పరిషత్ అధ్యక్షులు అళక్కి కృష్ణ, ఉపాధ్యక్షులు హరగోపాల శర్మ, సెక్రటరీ అణివిళ్ల శాస్త్రి, చర్ల రామారావు, రావులపర్తి విజయ్, జమ్మి కృష్ణారావు, నరసింహమూర్తి, బిఎన్ఆర్.శాస్త్రి, వేదుల శర్మ, తమ్మన కృష్ణ, కె.సూర్యనారాయణ, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

సామర్లకోట పంచారామ క్షేత్రంలో 25 వార్షిక వేద సభ ఘనంగా నిర్వహించారు. విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర, ఊరి వెంకట సూర్యప్రకాశ స్వామి ఆధ్వర్యంలో రాష్ట్ర నలుమూలల నుండి హాజరైన సుమారు 150 మంది వేద పండితులకు సత్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అనంతబాబు. భీమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షులు మట్టపల్లి రమేష్ బాబు, ఇఒలు డి.నాగమల్లేశ్వరరావు, పులి నారాయణమూర్తి, శ్రీపాద రాజశేఖర్ శర్మ, చందలాడ అనంత పద్మనాభం, వేమూరి సోమేశ్వర శర్మ, ప్రగతి విద్యాసంస్థల అధినేత నూతలపాటి పూర్ణచంద్రరావు, నోరి కృష్ణారావు, గ్రంధి సత్య రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు



పిడిఎఫ్ బియ్యం స్వాధీనంచేసుకున్న విజిలెన్స్ అధికారులు

పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో ఆదివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవ చేసిన 5 టన్నుల పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు .గ్రామంలోని గంటా సాయిబాబు ఇంటిలో 96 ప్లాస్టిక్ బస్తాల్లో నిలువ చేసిన బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎంఎస్ఒ విజయకుమారి తెలిపారు. ఈ బియ్యం విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఈ బస్తాలను సీజ్ చేసి 6ఎ కింద కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ విజయకుమారి తెలిపారు.ఈ దాడుల్లో విజిలెన్స్ సిఐ ఎన్.రమేష్, విఆర్ఒ వెంకటేశ్వరరావు, జివిఎస్ లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సారాను స్వాధీనం చేసుకున్న దృశ్యం

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో సారా బట్టిపై ఎస్ఇబి పోలీసులు దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన గండిపోయిన వీర మహేంద్ర అటవీ ప్రాంతంలో సారా బట్టిలు నిర్వహిస్తున్నాడని అందిన సమాచారం మేరకు ఎస్ఈబి పోలీసులు సారాబట్టీపై దాడి చేశారు. ఈ సందర్భంగా 33 లీటర్ల సారా, ఒక మోటర్ బైక్ కు స్వాధీనం చేసుకుని, 600 లీటర్లు పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. గండిబోయిన వీర మహేంద్రను అరెస్టు చేసి రిమాండ్ పంపించడం జరిగిందని తెలిపారు.



బాధితకుటుంబానికి సాయం అందజేస్తున్న ఎంఎల్ఎ

పిడుగుపాటుకు పెంకుటిల్లు ధ్వంసం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలం రామన్నపాలెం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగు పాటుకు జొన్నకూటి సుబ్బారావు పెంకుటిల్లు పూర్తిగా ధ్వంసం అయింది. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారుగా రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఇంటి యజమాని వాపోయాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఘటన స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బాధితులకి రూ.5,000 ఆర్థిక సహాయం, 20 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసి ప్రభుత్వం తరపున సాయం తొందరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుల్లారావు, డిప్యూటి తహశీల్దార్, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోపాలపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిట్యాల గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు(30) శనివారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అదే రోజు రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో మండలంలోని చిట్యాల గ్రామ శివారు గల మాతంగి అమ్మ వారి గుడి సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అతనినిఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెళ్లిపోయింది. మృతునికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మతిచెందాడాని తెలిపారు. మృతుని తండ్రి గంగుల వెంకట రెడ్డి ఫిర్యాదు మేరకు గోపాలపురం పోలీసు స్టేషన్ నందు యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి గోపాలపురం ఎస్.ఐ కె.సతీష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం హుస్సేన్ పురం గోదావరి కాలవలో ఎస్సి కాలనీ వద్ద ఆదివారం సుమారు 25 ఏళ్లలోపు వయసుగల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మతుని వివరాలు తెలిసినవారు సామర్లకోట సిఐ సెల్ నెం.9440796568, ఎస్ఐ సెల్ నెం. 9701626505 సమాచార ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరి...?

- సమస్యలలో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- పెరిగిన ధరలకు అనుగుణంగా పెరగని బడ్జెట్
- ఆందోళనలో మిడ్ డే మీల్స్ కార్మికులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెట్టి ఆకలితీర్చే మధ్యాహ్న భోజన కార్మికులు అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలల సెలవులు మినహా నెలంతా వండి పెట్టినా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 3000 మించి ఇవ్వడం లేదు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వండి వడ్డిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి వండి పెట్టడానికి అవసరమైన నూనె, పోపు గింజలు, పప్పు, ఉప్పు, చింతపండు, కూరగాయలు, వంట చెరుకు తదితర సామగ్రి కోసం రూ.4.97 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ. 7.45 పైసలు ప్రభుత్వం చెల్లిస్తోంది. కనీసం ప్రాథమిక పాఠశాలలో రూ10, హైస్కూల్ విద్యార్థులకు రూ 20 చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 100 గ్రాములు, హైస్కూల్ విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున బియ్యం సరఫరా చేస్తారు. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజులపాటు కోడిగుడ్డు కూడా ఉడికించి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ఒక్కో విద్యార్థి కోసం ఇచ్చే డబ్బు మాత్రం పెంచడం లేదు. కట్టెల పొయ్యి వాడొద్దని చెబుతూనే ప్రత్యామ్నాయంగా సబ్సిడీపై వంటగ్యాస్ అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్ఎంసి కమిటీలు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న గోరుముద్ద పేరుతో మెనూ మార్పులు చేసింది. ఆ మార్పులు తగినట్లుగా బిల్లులు పెంచలేదు. మరోవైపు ఎస్ఎంసి కమిటీలను నియమించింది. ఈ కమిటీల్లో రాజకీయ జోక్యం పెరగడంతో మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారాయి. నాణ్యత తగ్గినా, కూరలు, పప్పులు సరిపోయినంత ఇవ్వకున్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక స్థాయి పిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం వంద గ్రాముల బియ్యం ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలు అల్పాహారం తీసుకునే అలవాటు లేకపోవడం అందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న 100, 150 గ్రాముల బియ్యం సరిపోకపోవడం, అదనంగా ఎస్ఎంసి కమిటీ సభ్యులు అక్కడే భోజనం చేయడం ఫలితంగా కొన్నిచోట్ల భోజనం సరిపోవడం లేదు. ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తున్నా హమాలీ ఛార్జీలు మధ్యాహ్న భోజన కార్మికులే భరించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లుతో నాణ్యత విషయంలో రాజీ పడలేక ఇంటి నుంచి అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రాగిజావకు ప్రత్యేక కేటాయింపులేవీ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ చేయాలని ఆదేశించిన విషయం విధితమే. అయితే వీటి కోసం ప్రత్యేకంగా చెల్లింపులు ప్రకటించలేదు, వంట పాత్రలు సైతం అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మెస్ బిల్లులు వేతనాలు ఇప్పటికీ పెండింగ్లో ఉంటున్నాయి. మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ ఛార్జీలు కాకుండా వంట సరుకులు కూడా సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు. కట్టెల పొయ్యిపైనే వంట చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల్లో చాలామంది ఆస్తమా, ఎలర్జీలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. మూడు, నాలుగు నెలలకు కూడా బిల్లులు రాని పరిస్థితుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ఇంటి నుంచి పెట్టుబడి పెట్టి వండి వడ్డించాల్సి వసుంది. గౌరవ వేతనం మండల విద్యాధికారి ఖాతాలో జమవుతాయి. మండల విద్యాధికారి జిల్లా అధికారులకు బిల్లును పంపగా అక్కడ నుంచి రాష్ట్ర ఫైనాన్స్ విభాగానికి వెళ్తాయి. నిధుల లభ్యతను బట్టి ఫైనాన్స్ క్లియరెన్స్ అందితే వీరికి మూడు, నాలుగు నెలలకొకసారి డబ్బు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వేతనాన్ని పెంచడంతోపాటుగా సరుకుల ఛార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

నెలకు రూ.12వేల వేతనం ఇవ్వాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 12000 ఇవ్వాలి. గత 20 సంవత్సరాలుగా పాఠశాలల విద్యార్థులకు ఈ పథకం ద్వారా మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం వండి పెడుతున్నారు. ప్రభుత్వం చెల్లించే ధరలకు మార్కెట్‌లో సరుకులు రావడం లేదు. కట్టెల పొయ్యి వాడకం ఫలితంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నాం. నిత్యావసర సరుకులు, గ్యాస్ ప్రభుత్వం పంపిణీ చేయాలి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ 10, హైస్కూల్ విద్యార్థులకు రూ 20 చొప్పున చెల్లించాలి.

-సిహెచ్ బేబీ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు

యానాం వార్తలు

ఎంబిబిఎస్ సీట్ల వివరాల విడుదల

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించిన వివరాలను హెల్త్ సెక్రటేరియట్ అధికారులు విడుదల చేశారు. ఇందిరా గాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో మొత్తం 180 సీట్లకు గాను ప్రభుత్వ కోటాకు 131 ఆల్ ఇండియా కోటా 27, ఎన్ఆర్ఐ కోటా 22 సీట్లు కేటాయించారు. మహాత్మాగాంధీ మెడికల్ కళాశాల్లో బిడిఎస్‌లో యానాం-1, పుదుచ్చేరి-31, కారైకల్-8, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.రాజీవ్ గాంధీ కళాశాలలో యానాం-1,కారైకల్-8,పుదుచ్చేరి-33, మాహే-2 సీట్లు లభిస్తున్నాయి.

అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు సిఎం అంగీకారం

ప్రజాశక్తి - యానాం

యానాంలో 108 అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లకు పుదుచ్చేరి ప్రభుత్వం అంగీకారం తెలపడంతో డ్రైవర్లు నిరసన విరమించారు. రోజువారీ రూ.895 ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సిఎం రంగసామి అంగీకరించడం తో నిరసను విరమిస్తున్నామని ఆదివారం డ్రైవర్ల సంఘ యూనియన్ నేతలు బి. ముసలయ్య, బొడ్డు ప్రసాద్, సీహెచ్ సుబ్బారావు, బేతాళం సతీష్, రామలింగం తదితరులు తెలిపారు.



ఏడిద రోడ్డులో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు పెద్ద వంతెన, కృష్ణ టాకీస్ ఎదురుగా, ఏడిద రోడ్డులోని ఆటో స్టాండ్ సమీపంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిరూపయంగా మారాయి. పట్టణ పరిశుభ్రతలో భాగంగా గత ప్రభుత్వంలో వీటిని నిర్మించినప్పటికీ ప్రస్తుతం ఇవి వినియోగం లేకపోవడంతో పాడైపోతున్నాయి. వీటిని వినియోగంలో తీసుకు రావడంతో పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు ఇవి ఉపయోగపడతాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యర్రపోతవరం వంతెన వద్ద ఆక్రమణల పర్వం

పట్టించుకోని ఆర్ అండ్ బి శాఖ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ -యానం మెయిన్ రోడ్ లోని ఎర్ర పోతవరం వంతెన వద్ద ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే ఈ వంతెన వద్ద పలు ఆక్రమణలతో రెండు వైపులా రోడ్డును ఆక్రమించి పలు షాపులు వెలిశాయి. ఇది చాలదన్నట్లు ఇటీవల మరిన్ని ఆక్రమణలు కొనసాగుతున్నాయి చాలా మంది ఆక్రమణతోర్లు శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. ఈ ఆక్రమణల వల్ల వంతెనపై నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇక సాయంకాలం సమయంలో ట్రాఫిక్ సమస్య మరింత దారుణంగా ఉంటుంది. రోడ్డుపై బహిరంగంగా ఆక్రమణలు జరుగుతున్న రహదారి భవనాల శాఖ అధికారులు చూసి ఉన్నట్లు వ్యవహరించడంతో రోజురోజుకీ ఆక్రమణలు మరింత పెరుగుతున్నాయి. ఒకవైపు ఇరిగేషన్ అధికారులు కాలువ వైపు ఆక్రమణలు జరుగుతున్న వాళ్లు పట్టించుకున్న దాఖలాలు లేవు దీంతో మెయిన్ రోడ్డు కాలువకు ఆనుకుని అనేక బడ్డీలు వెలుస్తున్నాయి. ఆక్రమణం తొలగించి రోడ్డు విశాలం చేయాలని నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు



ఎర్ర పోతవరం వంతెనవద్ద పెరిగిపోతున్న అక్రమ కట్టడాలు

ప్రమాదకరంగా రహదారి వంతెన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వాకతిప్ప గ్రామ శివారులో పంట కాలువ పై ఉన్న రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఎస్ ఆకారంలో ఉన్న ఈ రహదారి మలుపులో వంతెన ఎడమవైపు రక్షణ గోడ కొంత భాగం కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే లోతైన పంట కాలువలోకి వాహనచోదకులు పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితి . ఈ వంతెన రహదారిమలుపు మీదుగా వాకతిప్ప నుంచి నాగుల చెరువు కు వెళ్లే గ్రామాలతో పాటు కోరుమిల్లి, మాచర, శ్రీరాంపురం, గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని, రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామస్తులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు .



రక్షణ గోడ విరిగి ప్రమాదభరితంగా ఉన్న రహదారి మలుపు

పలువురికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

కోరుమిల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సందర్భంగా గ్రామానికి చెందిన కంఠం శెట్టి సత్యం, సత్యవతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కంఠం శెట్టి ఆది నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచి త కంటి వైద్య శిబిరం లో మండపేట జయరామ్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు కంఠం శెట్టి ప్రతాప్ చౌదరి పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కేట్రాక్ట్ అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో కాకినాడ చెందిన కంటి వైద్యరాలు డాక్టర్ అరుణ, వాసంశెట్టి విజయ కుమార్, తొగరు జానకి రామయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణంలో ఏ వార్డు పరిధిలో ఏ వీధికి వెళ్ళినా కుక్కలబెడద తప్పటంలేదు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి ఈ సమయంలో అనేకమంది ఈ కుక్కల దాడిలో గాయపడుతున్నారు. ప్రతి రోజూ కుక్క కాటుల వల్ల ప్రభుత్వాస్పత్రికి వస్తున్న బాధితులు సంఖ్య పెరుగుతుందని ఆస్పత్రుల గణాంకాలు చెబుతున్నాయి. మున్సిపల్ అధికారులు పాలక వర్గం వీటిపై శ్రద్ధ చూపాలనే పట్టణ వాసులు కోరుతున్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా వీటి విషయంలో జోక్యం చేసుకోలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. అయితే వీటిని పట్టుకొని సుదూర ప్రాంతాల్లో వదిలి పెట్టాలని బాధ్యత అధికారులకు లేదా అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. వాటి సంఖ్య పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

విద్యాలక్ష్మి గణపతి ఉత్సవాలకు రాట ప్రతిష్ట

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక ముసలమ్మ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న విద్యాలక్ష్మి గణపతి వారి గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వాహణ కోసం o ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాటముహూర్తం నిర్వహించారు. సహస్ర నామ పారాయణ, పంచామత అభిషేకం, గోక్షీర నవధాన్యాలతో భూమాత పూజ నిర్వహించి రాట ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఛైర్మన్ పెద్దిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 18 నుంచి 26 వరకు గణపతి సహస్ర నామంతో నవరాత్రి వ్రతం జరుగుతుందని తెలిపారు.

గోశాలకు ఆవు అందజేత

ప్రజాశక్తి - కడియం

కడియంలో మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోశాలకు రోజురోజుకు భక్తులు పోటెత్తుతున్నారు. పలువురు దాతలు గోవులకు, పశు గ్రాసాన్ని విరివిగా అందిస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన బిజెపి మండల శాఖ ఉపాధ్యక్షులు గారపాటి తాతబ్బాయి, సత్యవేణి దంపతులు రూ.30వేల విలువచేసే గిరి ఆవును ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ, గోసాల కమిటీ సభ్యులు పిండి నాగరాజులకు అందించారు. 6 నెలలపాటు తన కుటుంబ సభ్యులకు గల 50 సెంట్లు వ్యవసాయ భూమిలో గడ్డినిగోశాలకు అందించనున్నట్లు తాతబ్బాయి తెలిపారు.



సుబ్రహ్మణ్యానికిసాయంఅందజేస్తున్నమానవతా శాఖ సభ్యులు

'మానవత' శాఖ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

పక్షవాతంతో బాధపడుతూ జీవనోపాధికి ఇబ్బంది పడుతున్న తాళ్లపూడికి చెందిన చల్లా సుబ్రహ్మణ్యంకు మండల మానవతా శాఖ ఆదివారం రూ. 5వేల ఆర్థికసాయం అందజేసింది. మానవతా సభ్యులు సిహెచ్.బంగారుబాబు మరో రూ.వెయ్యి సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ అధ్యక్షులు ఎస్. సుబ్బారావు, కార్యదర్శి టి.దోసాలు, కోశాధికారి ఎ.హనుమంతరావు, రీజనల్ ఛైర్మన్ వి .చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - గోకవరం

మండల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలు ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది కలిసి బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని ఎస్ఐ శివ నాగబాబు ఆదివారం తెలిపారు. మండలంలో ఎక్కడ చట్ట వ్యతిరేక పనులను చేయరాదని, ప్రజలకు ఎటువంటి ఆటంకాలు ఉండరాదని తెలిపారు. మండల ప్రజలు దీనిపై నిబద్ధత కలిగి ఉండాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక ఒక వ్యక్తికి గుండెపోటు వచ్చింది. అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. వివరాలు ఇవి.. చంద్రబాబు అరెస్టను చేయడంతో ఆ విషయాన్ని తట్టుకోలేక మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త జొన్నకూటి రాజు(51)కు గుండెపోటు వచ్చింది. దీంతో అతనిని కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఏ వేగుళ్ల జోగేశ్వరరావు ఫోన్ లో మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రాజు మృతికి ఎంఎల్ఏ వేగుళ్ల సంతాపం తెలిపారు. టిడిపి శ్రేణులు మతిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

CHANGE OF NAME

I, undersigned **KUKKALA LAKSHMI (Old Name), W/o. Kakkala Govindu,** R/o. D.No. 1-290, Ammireddy Colony, Komaripalem (V), Biccavolu (M), East Godavari District, A.P-533 346. Have Changing My Name From **KUKKALA LAKSHMI (Old Name) to KAKKALA LAKSHMI (New Name)** hence forth Iam Being Called as **KAKKALA LAKSHMI (New Name)** for all Purposes.

ప్రకటన

మా క్లయింటు డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, సావరం గ్రామ కాపురస్తులు **1) లేటు పోలుమాటి సూర్యారావు గారి కుమారుడు రామకృష్ణ 2) పోలుమాటి రామకృష్ణ గారి భార్య ఎస్తేరు శిరీషారాణి** అను వారులు ఇచ్చిన సంజాయిషీపైన యావన్మందికీ తెలియజేయు పేపరు ప్రకటన..,

మా క్లయింట్లు అమలాపురం మండలం, సావరం గ్రామంలో డో.నెం. 1-5-15/1ఎ లో నివసించుచున్నారు. మా రెండవ క్లయింటు అమలాపురం ఏరియా హాస్పటలులో నర్సుగా పని చేయుచున్నారు. వారికి **సుకాంత్ అను కుమారుడు మరియు అమూల్య అను కుమార్తె కలరు.** మా క్లయింట్లు కుమార్తె అయిన అమూల్య మానసిక స్థితి సరిగా లేనందున ఆమెకు వివాహము కాలేదు. మా క్లయింట్లు వద్దనే ఉంటున్నది.

మా క్లయింట్లు కుమారుడు సుకాంత్ కూడా వారితో ఉంటూ **సుమారు 3 నెలల క్రితం మమ్ములను ఇళ్ళు వదలి వెళ్ళిపోయి మా అభిప్రాయములకు విరుద్ధముగా అనుమతి లేకుండా తనకు నచ్చిన విధముగా ప్రేమ వివాహము చేసుకొనియున్నాడు.** మా క్లయింట్లుకు సదరు వివాహము ఇష్టము లేదు. వివాహము అయిన దరిమిలా సుకాంత్ తన భార్యతో విడిగా కాపురం చేయుచూ మమ్ములను గాని మానసిక వైకల్యము కలిగిన మా కుమార్తెను గాని చూడకుండా నిర్లక్ష్యము చేసినాడు. అతను మా క్లయింట్లు కుటుంబముతో తెగతెంపులు చేసుకొని విడిగా బ్రతుకుతున్నాడు. ఈ కారణము వలన మా క్లయింట్లు కూడా అతనితో పూర్తి తెగతెంపులు చేసుకొని వారి జీవితమును వారు గడుపుటకు నిర్ణయము తీసుకొని వారి జీవితములు వారు గడుపుతున్నారు. అందువల్ల మా క్లయింట్లకు వారి కుమారునితో గాని, వాని భార్యతో గాని ఎటువంటి సంబంధ బాంధవ్యములు లేవు. వానికి మా క్లయింట్లు యొక్క చరస్థిరాస్థులతో గాని మరియు మా రెండవ క్లయింట్లు పదవీ విరమణ దరిమిలా వసూలు పొందు బెనిఫిట్సుతో గాని సంబంధము లేదు. కాబట్టి ఇందుమూలముగా మా క్లయింట్లు తరుపున తెలియజేయునది ఏమనగా సదరు సుకాంత్ గాని, వాని భార్య గాని జరుపు ఏవిధమైన లావాదేవీలు మరియు ధన సంబంధమైన ఋణ వ్యవహారములు గాని, మా క్లయింట్లును వారి చరస్థిరాస్థులను బైండు చేయవని మరియు వారితో లావాదేవీలు జరుపు వ్యక్తులు నష్టపోవుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అమలాపురం, ది.10-09-2023.

ఎన్.వి.సూర్యనారాయణ
అడ్వకేట్, శ్రీ సూర్య అపార్ట్‌మెంట్, అమలాపురం.
సెల్: 70323 54858